ఆంధ్రప్రభ - సెప్టెంబర్ 13/19, 1995

"ఇప్పటికి ఓటుహక్కును పద్దెనిమిదేళ్ళ దాకా దింపాం. ఇంకా దింపాలి మరి. ఎందుకంటే భారత పౌరులకూ, నీకూ వయసులో తప్ప తేడా లేదు-" అన్నాడు బాబాయి ఒకటో క్లాసు చదువుతున్న చిట్టితో...."

# చిట్టిపాట

చిట్టి ఒకటో క్లాసు చదువుతోంది. దానికి పాటలు పాడాలని సరదా! తనకు నచ్చిన ప్రతి పాటనూ శ్రద్ధగా విని నేర్చుకుని పాడుతూంటుంది. దాని పాటలు విని తల్లిదండ్రులెంతో మురిసిపోతుంటారు.

ఒకసారి బడిలో పాటల పోటీలయ్యాయి. అందులో చిట్టికి మూడో బహుమతి కూడా రాలేదు. దానికి చాలాకోపం వచ్చింది. అక్కడేం చేయలేక ఇంటికొచ్చాక ఏడ్చింది.

"పోటీలో నీకన్యాయం జరిగింది. నువ్వు చాలా బాగా పాడుతావు. నీ పాట విన్నప్పుడు నేను వంట సగంలో మానేసి వచ్చేస్తాను. నీకు తెలుసు కదా!" అంది తల్లి.

ఈ విషయం చిట్టికి తెలియదు. అందుకని అది ఆశ్చర్యపోయి, "నిజమా నాన్నా?" అని తండ్రి వంక చూసింది.

తండ్రి నిజమని చెప్పడమే కాక, "నువ్వు పాట పాడితే నేను కూడా పేపరు చదువుతున్నా, బట్టలు మార్చుకుంటున్నా, స్నానం చేస్తున్నా సగంలో వదిలేసి వచ్చేస్తాను" అన్నాడు.

"మరి నాకెప్పుడూ తెలియలేదే?" అంది చిట్టి ఆశ్చర్యానందాలలో మునిగి తేలుతూ.

"పాట పాడుతున్నప్పుడు నీకు ఒళ్ళు తెలియదు. నువ్వు త్యాగరాజు, తాన్‌సేన్ అంత గొప్పదానివి. వాళ్ళు పాట పాడేటప్పుడు అందులోనే మునిగిపోతారు. పరిసరాలు తెలియవు. నీకూ అంతే! అన్నాడు తండ్రి.

త్యాగరాజులా పాడడం ఇష్టమే కానీ పాటలో మునిగిపోవడం చిట్టికి నచ్చలేదు. పరిసరాలు తెలియకపోతే పాట పాడిన ఆనందమేముంటుంది? అందుకని అది ఒళ్ళు తెలిసేలా జాగ్రత్తపడి ఆ విషయం తల్లిదండ్రులకు చెప్పి తనొక పాటపాడిందొక రోజు. అప్పుడు తల్లి సగంలో వంట వదిలేసి వచ్చింది. తండ్రి స్నానం మధ్యలో వచ్చేశాడు.

చిట్టికి కలిగిన ఆనందమింతా అంతా కాదు.

ఒకరోజున చిట్టి ఈ విషయం మొదటి బహుమతి వచ్చిన గీతకు చెప్పింది. గీత ఆశ్చర్యపడి తనూ ఇంట్లో అలానే పాడింది. కానీ తల్లిదండ్రులు దాన్ని వేళకాని వేళలో పాటలేమిటని తిట్టారు.

గీత ఇందుకెంతో నిరుత్సాహపడి రోజూ సంగీతం నేర్పడానికి వచ్చే టీచర్‌కీ విషయం చెప్పుకుని బాధపడింది. "అందరు తల్లిదండ్రులకూ సంగీతజ్ఞానముండదు. నేను చెబుతున్నానుగా నువ్వు చాలా బాగా పాడతావు" అన్నాడు టీచర్.

ఈ విషయం గీత చిట్టికి చెప్పింది క్లాసులో. "ఎంచక్కా మీ అమ్మా, నాన్నలకు సంగీతజ్ఞానముండి నువ్వెలా పాడినా మెచ్చుకుంటారు" అని అసూయపడినట్లుగా నటిస్తూ తన గొప్పతనాన్ని ప్రకటించుకుంది.

అప్పుడు చిట్టికి గీత ఎందుకు బాగా పాడుతుందో అర్థమైంది. అదింటికి వెళ్ళి తనకూ సంగీతం టీచర్ని పెట్టమంది. తల్లిదండ్రులు గీత టీచర్నే చిట్టికి కుదిర్చారు.

చిట్టి టీచరుతో – "మేష్టారూ! వచ్చే సంగీతం పోటీల్లో నాకే మొదటి బహుమతి రావాలి" అని చెప్పింది.

"నా ప్రయత్నం నేను చేస్తాను. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి" అన్నాడు సంగీతం టీచరు.

మళ్ళీ పోటీలయ్యాయి. మళ్ళీ గీతకే మొదటి బహుమతి వచ్చింది. చిట్టికి ఏ బహుమతీ రాలేదు. మళ్ళీ చిట్టి ఇంటికెళ్ళి ఏడ్చింది.

"ఆ సంగీతం టీచరుకు గీతంటేనే ఇష్టం. దానికి బాగా నేర్పాడు. నీకు నేర్పలేదు. ఇక నువ్వాయన దగ్గర నేర్చుకోకు" అంది తల్లి.

"ఆ పోటీలో నీకు అన్యాయం జరిగింది. మీకు జడ్జిగా ఉన్నాయన నాకు తెలుసు. ఆయన్నోసారి ఇంటికి పిలుస్తానుండు" అన్నాడు తండ్రి.

నాలుగు రోజుల తర్వాత పాటల జడ్జి వాళ్ళింటికి వచ్చాడు. తల్లిదండ్రులు చిట్టి బాధను ఆయనకు చేరవేశారు. ఆయన చిట్టినోసారి పాట పాడమన్నాడు. అది పాట పాడుతూంటే ముగ్గురూ పరవశంగా విన్నారు.

"ఎంత బాగా పాడావమ్మా!" అని మెచ్చుకున్నాడు జడ్జి.

"పోటీలో ఇంకా బాగా పాడాను. గీత అసహ్యంగా పాడింది. అయినా దానికి మొదటి బహుమతినిచ్చారు. నాకు మూడోస్థానం కూడా రాలేదు" అని చెప్పింది చిట్టి.

జడ్జి బాధగా నిట్టూర్చి – "చాలా సారీ చిట్టీ! తేడా అంతా అక్కడి కుర్చీలో ఉంది. అక్కడ కూర్చుంటే అన్యాయమే చేయాలనిపిస్తుంది" అన్నాడు.

"మరి నాకు న్యాయం జరగాలంటే నేనేం చేయాలి?" ఇదీ చిట్టి బాధ.

"బయట న్యాయం లేదు. పదవిలోకి వచ్చిన నాయకులు, ఆస్పత్రుల్లో డాక్టర్లు, కోర్టుల్లో న్యాయమూర్తులు, స్టేషన్లో పోలీసులు, ఆఫీసుల్లో ప్రభుత్వోద్యోగులు అందరూ అన్యాయాలే చేస్తున్నారు. ఈ అన్యాయాలన్నీ పోయేదాకా నీకూ న్యాయం జరగదు

కాబట్టి, ఇప్పట్నించీ నువ్వు అన్యాయం గురించి ఆలోచిస్తూ వాటిని పోగొట్టే ఉపాయాలు వెతుకు. ఆ తర్వాతనే బయట పోటీల్లో పాడు" అన్నాడు జడ్జి.

"మరి నేను సంగీతానికి న్యాయం చేయొద్దా?" అంది చిట్టి ఆరిందాలా.

"నేను హామీ ఇస్తున్నాను. నువ్వు పోటీల్లో బహుమతి తెచ్చుకోవాలన్న కోరికను చంపుకుంటే సంగీతానికి న్యాయమే జరుగుతుంది. అన్యాయం జరగదు" అన్నాడు జడ్జి.

చిట్టికి అర్థం కాలేదు. కానీ తల్లిదండ్రులు నవ్వారని తనూ నవ్వి, "నాకు పాటలు పాడాలని సరదా అంకుల్!" అంది కాస్త బాధగా.

"దానికేముంది? ఇంట్లోనే పాడుకో" అన్నాడు జడ్జి.

కొన్నాళ్ళు చిట్టి అలాగే చేసింది. అప్పుడు తల్లిదండ్రులు విసిగిపోయి – "నీ పాటలతో మా ప్రాణాలు తీస్తున్నావు. మా పనులన్నీ పాడు చేస్తున్నావు. ఇక పాడావంటే నోటికి టేపు వేస్తాం" అన్నారు.

చిట్టికి కోపం రాలేదు. ఏడుపు రాలేదు. భారంగా నిట్టూర్చి, "అన్యాయం బయటే కాదు. మా ఇంట్లోక్కూడా పాకిపోయింది" అనుకుంది.

ఆ తర్వాత వాళ్ళింటికోరోజున చిట్టి బాబాయి వచ్చాడు. అతడు పౌరహక్కులకు సంబంధించిన ప్రభుత్వోద్యోగంలో ఉన్నాడు. చిట్టి బాధను విన్నాక – "అన్యాయాల గురించి భారత పౌరులందరూ నీ స్థాయిలోనే ఆలోచిస్తున్నారు. ఎటొచ్చీ వాళ్ళకు ఓటుంది. నీకు లేదు. కాబట్టి నీ మాటకు విలువలేదు" అన్నాడతడు.

"వాళ్ళలాగే ఆలోచిస్తున్నప్పుడు నాకూ ఓటెందుకివ్వరు?" అంది చిట్టి.

"ఇది ఆలోచించాల్సిన విషయమే. ఇప్పటికి ఓటు హక్కును పద్దెనిమిదేళ్ళ దాకా దింపాం. ఇంకా దింపాలి మరి. ఎందుకంటే భారత పౌరులకూ, నీకూ వయసులో తప్ప – తేడా లేదు" అన్నాడు బాబాయి.

ఈ మాటలు చిట్టికి ఉపశమనం కలిగించాయి. ఎందుకంటే ఆమె కిప్పుడు ఇంటా, బయటా కూడా పాటలు పాడే అవకాశం లేదు!

✦ ✦ ✦